## మన ఆచారములు - అంతరార్థములు

## దీపం వెలిగించడమెందుకు?

*(రచయితకు ధన్యవాదములు. విలువైన సమాచారము పాఠకుల సౌకర్యార్థం ప్రచురించబడినది.)*





మనలో చాలా మందికి ప్రార్థనా సమయములో దీపము వెలిగించడము అలవాటే. అన్ని ముఖ్యమైన కార్యక్రమములలోనూ, పండుగ సందర్భములలోను, సాంఘిక కార్యక్రమముల ప్రారంభోత్సవములలోనూ మొదట దీపాన్ని వెలిగించడం, చివరివరకు దానిని వెలుగుతూ ఉండేటట్లు చూడడం, మనకు తెలిసినదే! కాని ఎందుకు? దాని వెనుక కారణమేమిటి?

వెలుగు విజ్ఞానానికి, అంధకారం అజ్ఞానానికి ప్రతీక. భగవంతుడు, సర్వాంతర్యామి, మనలోని చైతన్య స్వరూపుడు ఎప్పుడూ తరగని విజ్ఞానమనే వెలుగుకు మూలం. కావున వెలుగు ఆ భగవంతుని రూపముగానే ఆరాధించబడుతున్నది.

వెలుగు చీకటిని తొలగించినట్లే, విజ్ఞానమనే వెలుగు మనలోని అజ్ఞానమనే అంధకారాన్ని తొలగిస్తుంది. విజ్ఞానమనేది ఎన్నటికీ తరగని అంతరంగమందలి సంపద (గని). దీని కారణముగా బయట ప్రపంచములో విజయములను సాధించవచ్చును. కావున మనము దీపము వెలిగించి, దాని ద్వారా అత్యుత్తమమైన సంపదకు, అనంతమైన విజ్ఞానానికి తలవంచి నమస్కరించడము చేస్తున్నామన్న మాట. ఈ విజ్ఞానము మనము చేసే మంచి లేదా చెడు ప్రక్రియలకు మూలము. కావున మనము చేసే ప్రతి ముఖ్యమైన కార్యక్రమములలో దీపమును వెలిగించి, మనయొక్క ఆలోచనలకు, పనులకు సాక్షిని చెయ్యడము ఇందులోని ముఖ్యోద్దేశము.

విద్యుత్‌దీపములు (లైట్ బల్బ్ గాని, ట్యూబ్ లైట్‌గాని) ఎందుకు వెలిగించకూడదు? అది కూడా అంధకారాన్ని తొలగిస్తుంది కదా! కాని మన సాంప్రదాయములో నూనె దీపమునకు ఆధ్యాత్మికపరమైన విశిష్టత ఉంది. నూనె లేదా నెయ్యి మనలోని పూర్వజన్మ వాసనలను, వత్తి మనలోని అహంకారమును తెలియజేస్తాయి. ఆధ్యాత్మిక విజ్ఞానముతో వెలిగించబడిన దీపము, నెమ్మదిగా విషయ వాసనలను హరించి, తరువాత మన అహంకారమును కూడా నశింపజేస్తుంది. దీపముయొక్క శిఖ ఎల్లప్పుడూ పైకే చూస్తుంది. అలాగే మనము ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని సముపార్జించి, తద్వారా ఉచ్ఛస్థితిని పొందాలి. కొన్ని చోట్ల క్రొవ్వొత్తిని ఉపయోగించే ఆచారముంది. ఇందులో నూనెకు బదులు క్రొవ్వును వాడతారు.

ఒక దీపము తననుండి వందల సంఖ్యలో దీపములను వెలిగించినట్లు, ఒక గురువు తన విజ్ఞానముతో ఎంతో మందిని ప్రభావితులను చేస్తాడు. దీపముయొక్క ప్రకాశక గుణము మరెన్ని

*బాల్యంలో నేర్చుకున్నది జీవితాంతం కొనసాగుతుంది*

దీపములకు పంచినా, దాని ప్రకాశక గుణము ఎప్పుడూ నశించదు. అలాగే విజ్ఞానముకూడా వేరొకరితో పంచుకొనడమువలన తగ్గిపోయేది కాదు. విశేషమేమంటే విజ్ఞానము పంచడమువలన మరింత పెరుగుతుంది. విజ్ఞానమును పంచుతున్నవారు, గ్రహిస్తున్నవారు కూడా లాభమును పొందెదరు.
దీపం వెలిగించేటప్పుడు మనమీవిధముగా ప్రార్థిస్తాము.

దీప: జ్యోతి పరంబ్రహ్మ
దీప: సర్వ తమోపహమ్
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యా దీప నమోస్తుతే!

దీని అర్థమేమిటంటే 'విజ్ఞానమనే కాంతిని వెదజల్లుతూ, అజ్ఞానమనే అంధకారమును పాలద్రోలుతున్న ఓ దీపమా! నీకు నేను ఈ ఉదయం/సాయం సంధ్యా సమయములో సాష్టాంగనమస్కారము చేస్తున్నాను. నీ కారణముగా జీవితములో కోరినవన్నీ చేకూరుతున్నవి కదా!' అని.

ఇంటిని అందముగా తీర్చిదిద్దేది ఏమిటి -
సుందరమైన కాంతివంతమైన దీపశిఖ తప్ప!
బుద్ధిని చక్కగా వికసింపజేసేదేమిటి -
లోతైన విజ్ఞానమయమైన వికాసం తప్ప!

కావున మన ఆచారములు మనకు వివేకము కలుగజేసేవి, ఆధ్యాత్మిక జ్ఞానమును అందించేవి అయిన సంపదలు. మనకు తెలిసిన విషయములు ఇతరులతో పంచుకోవడము, వారిని గూర్చి శ్రద్ధ వహించడము ఆనందమును ఇస్తుంది. అది వివరించడము కష్టము, అనుభవపూర్వకముగా తెలుసుకోవడమే సరియైన మార్గము.

*** *** ***

ఇద్దరు ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకై తపించే వ్యక్తుల సంభాషణ:
మొదటి వ్యక్తి : గురువుగారిని కలిసినపుడు ఏమని ప్రార్థిస్తావు?
రెండవ వ్యక్తి : నా అజ్ఞానాన్ని మన్నించమని అడుగుతాను.
మొదటి వ్యక్తి : గురువులకు మన్నించడమనేది చాలా సాధారణమైన విషయము. నేనైతే నా అజ్ఞానాన్ని తొలగించమని ప్రార్థిస్తాను.
రెండవ వ్యక్తి : అజ్ఞానమును తొలగించమని అడిగే బదులు జ్ఞానాన్ని ప్రసాదించమని అడగవచ్చుకదా!
మొదటి వ్యక్తి : జ్ఞానమనేది ప్రతివ్యక్తి దగ్గరా ఉన్నదే! కాని అజ్ఞానపు చీకటిచే కప్పబడడం వలన (నివురుచే కప్పబడిన నిప్పులాగ) అది ప్రకటితమవడం లేదు. అందుకే అజ్ఞానాంధకారాన్ని తొలగించమని ఆయనను ప్రార్థించాలని నేననుకుంటున్నాను.
రెండవ వ్యక్తి : అవును నిజమే! అజ్ఞానము తొలగిన పిమ్మట జ్ఞానము స్వేచ్ఛగా విరజిమ్ముతుంది కదా!